సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 22 । నవంబర్ । 2023



విత్తనం నుంచి..

విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాతకు ప్రభుత్వం అండగా ఉంటోంది. ఆర్‌బీకేలతో సేవలు అందిస్తోంది. - 8లో



ఒడిశా వైపు పెద్దపులి

పెద్దపులి ఒడిశా అడవుల వైపు వెళ్లిపోయింది. పాతపట్నం మీదుగా గజపతి జిల్లా అడవుల్లోకి ప్రవేశించింది. - 8లో

డిగ్రీ పరీక్ష ఫీజుల చెల్లింపు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థుల నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షల నిర్వహణ కోసం ఫీజుల చెల్లింపు ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబర్ 4వ తేదీ వరకు అదనపు రుసుంతో ఫీజులు స్వీకరిస్తారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం చనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమ్ ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీసెట్–2023 బైపీసీ స్ట్రీమ్ తుది విడత వెబ్ కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయ కర్త గురుగుబెల్లి దామోదరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 22, 23వ తేదీల్లో ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపుతో పాటు ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్, 22 నుంచి 24వరకు ఆప్షన్ల ఎంపిక, 25న ఆప్షన్ల మార్పు, 27న సీట్ల అలాట్‌మెంట్, 28 నుంచి 30వ తేదీ వరకు కళాశాలకు రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. సెట్‌లో ర్యాంకు వచ్చి గతంలో హాజరు కాని విద్యార్థులు, కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లు లభించని విద్యార్థులు, కళాశాలలు మారాలనుకున్న విద్యార్థులు ఈ తుదివిడత కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ కార్యాలయంలో జూదం

కంచిలి: మండలంలోని ఎస్సార్సీ పురం పంచాయతీ పరిధిలోని మెయిన్‌రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న జూదం శిబిరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. కంచిలికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బారువ ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో శిబిరంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ 13 మంది ఆడుతుండగా, వారి నుంచి రూ.4,69,580ల నగదుతోపాటు 14 ఆండ్రాయిడ్ మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.


నాడు-నేడు పనులపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: నాడు–నేడు ఫేజ్ 2 పనులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లాకు పేరు తీసుకురావాలని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్ తెలిపారు. మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ శ్రీకాకుళం ఆధ్వర్యంలో మంగళవారం నాడు–నేడు ఫేజ్–2 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనులకు సంబంధించి శిక్షణ, అవగాహన కార్యక్రమం జిల్లా కేంద్రంలో జరిగింది. ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జయప్రకాష్ మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఫేజ్–2లో 1000 అంగన్‌వాడీ కేంద్రాల పనులు విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఈ డబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీఎస్ మూర్తి, జిల్లా నోడల్ అధికారి పి.మణెమ్మ, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆర్జేడీగా శాంతిశ్రీ



బగాది శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: మహిళా శిశు సంక్షేమ శాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)గా బగాది శాంతిశ్రీని నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిశ్రీ ప్రస్తుతం శ్రీకాకుళం ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్జేడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.చిన్మయిదేవి సెలవులపై వెళ్లడంతో.. బగాది శాంతిశ్రీకి స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.

నేడు జానపద సమ్మేళనం



కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ జానపద సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి గూట్ల లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తప్పెటగుళ్లు, కోలాట, గరిడి, గంగిరెద్దుల ఆట, ఎరుకులపాట, బుడబుక్కలపాట, డప్పు వాయిద్యం, హరికథ, బుర్రకథ బృంద కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని, విజయవంతం చేయాలని కోరారు.

క్లాప్ కొట్టాల్సిందే..!



- క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో ఈ-ఆటోల వినియోగం
- మున్సిపాలిటీలకు చేరుతున్న విద్యుత్ ఆటోలు
- జీపీఆర్‌ఎస్, సీసీ కెమెరా, మైక్, సైరన్‌లతో రూ.4.50లక్షలకే ఆటో
- కాలుష్యం లేకుండా చెత్త సేకరణ

కాశీబుగ్గ: క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మరో ఆదర్శప్రాయమైన నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు ఇకపై ఈ–ఆటోలను వినియోగించనుంది. ఇప్పుడు ఉన్న వాహనాలతో ఇంధన వినియోగం పెరగడంతో పాటు ఇరుకు సందుల్లోకి ఆ వాహనాలు వెళ్లలేకపోతుండడంతో విద్యుత్‌తో నడిచే ఈ–ఆటోలను ప్రవేశపెట్టింది. కాలుష్య రహితమే కాకుండా పాటు తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వస్తువులు వేర్వేరుగా ఈ ఆటోల్లో సులభంగా తరలించవచ్చు.

జిల్లా వ్యాప్తంగా 21 ఈ–ఆటోలు

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఉన్న 50 డివిజన్ల పరిధిలోని వీధుల్లో చెత్తను తరలించడానికి ప్రభుత్వం ప్రత్యేకమైన సీఎన్‌జీ వాహనాలను వినియోగిస్తోంది. అంతకంటే చిన్నవైన మూడు మున్సిపాలిటీల్లో ఈ–ఆటోలను వినియోగించనుంది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 16 సచివాలయాల పరిధిలో 31వార్డులు ఉన్నాయి. అందులో సుమారు 40వేలకుపైగా నివాసయోగ్యమైన గృహాలు ఉన్నాయి. పలువీధుల్లో చెత్తను తరలించేందుకు 9 ఈ–ఆటోలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు ఎనిమిది ఆటోలు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చేరాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 23 వార్డుల పరిధిలో 6 ఈ–ఆటోలు, ఆమదాలవలస మున్సిపాలిటీ 23 వార్డుల పరిధిలో 6 ఈ–ఆటోలు మంజూరయ్యాయి. కొద్ది రోజుల్లోనే గుంటూరు నుంచి ఇక్కడకు వాహనాలు రానున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇది వరకు ఉన్న రాజాం మున్సిపాలిటీ, పాలకొండ మున్సిపాలిటీలకు సైతం ఈ–ఆటోలు అందనున్నాయి.

గుంటూరు నుంచి రాక..

గుంటూరు నుంచి రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీలకు వీటిని సరఫరా చేస్తున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో పూర్తిగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నడిచే ఈ–ఆటోలు మెరుగైన పారిశుద్ధ్యానికి దోహదం చేస్తాయి. మున్సిపల్ డ్రైవర్లు, ప్రత్యేకంగా నియమించే డ్రైవర్లు వీటిని నడపనున్నారు. డ్రైవర్ క్యాబిన్‌తో పాటుగా వెనుకభాగంగా తడి చెత్త, పొడి చెత్తలకు రెండు క్యాబిన్లు ఉంటాయి. పొడి చెత్తలో సబ్ యూనిట్‌లుగా ఇంజెక్షన్ సూదులు, నాపికిన్‌లు వంటి వాటిని ప్రత్యేకంగా సేకరిస్తారు. రూ.4.50 లక్షలకు ఒక్కో ఆటోను అందిస్తుండటంతో వాటిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. వాహనం ఇరుకైన సందులు, వీధుల్లో ప్రయాణించేలా తీర్చిదిద్ది ఉన్నారు. వీధులలోకి ప్రవేశించగానే ప్రజలకు తెలియాలంటే సైరెన్‌తోపాటు, మైకు సదుపాయం కల్పించారు. జీపీఎస్, సీసీ కెమెరా సదుపాయం కూడా ఉంది.

ఈ-ఆటోలతో పర్యావరణ పరిరక్షణ



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి ఎనిమిది ఈ–ఆటోలు వచ్చి చేరాయి. మరొకటి రావాల్సి ఉంది. ఇరుకైన సందుల్లో వ్యర్థాలు సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి తడిచెత్త పొడిచెత్తను వేరు చేసి సంపదను సృష్టిస్తాం. డ్రైవర్‌లతో నిరంతరం చెత్త తరలించేలా చర్యలు చేపడతాం. జీపీఆస్‌తో పాటు సీసీ కెమెరాతో నిరంతరం పర్యవేక్షిస్తాం. ఇంధన భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుంది.

– టి.నాగేంద్రకుమార్, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చేరిన వాహనాలు



వాహనంలో సీసీ కెమెరా



సైరన్

'తెప్పోత్సవంలో భక్తులకు పక్కా ఏర్పాట్లు చేయాలి'



ధర్మానకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, ట్రస్టీలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్ర పుష్కరిణిలో ఈ నెల 24న జరగనున్న తెప్పోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు, లోపాలు లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. అరసవల్లి క్షేత్రంలో జరగనున్న హంసనావికోత్సవానికి (తెప్పోత్సవం) మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పెద్దపాడు క్యాంపు ఆఫీస్‌లో మంగళవారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, పాలకమండలి సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ తెప్పోత్సవానికి వేలల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, గత లోపాలు పునరావృతం కాకుండా తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఈ మేరకు ఏర్పాట్లను పాలకమండలి సభ్యులు పరిశీలించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జె.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి ఉన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం అనుబంధ కళాశాలల డిగ్రీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ కోర్సుల ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. డిగ్రీ రెగ్యులర్‌గా నాలుగో సెమిస్టర్ 11,368 మంది రాయగా, 4199 మంది ఉత్తీర్ణత సాధించారు. 36.94 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీఏలో 1527కి 693, బీబీఏలో 165కి 122, బీసీఏలో 161కి 134, బీకాంలో 1832కి 563, బీఎస్సీల్లో 7683కి 2687 మంది ఉత్తీర్ణత సాధించారు. అనంతరం పీజీ ఫలితాలు విడుదల చేశారు. బీఎడ్ ఎంఆర్‌లో మొదటి సెమిస్టర్‌లో 33 మందికి 33 మంది ఉత్తీర్ణత సాధించారు. పీజీ రెండో సెమిస్టర్‌కు సంబంధించి జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో 12 కి 12, ఎకనామిక్స్‌లో 12కి 12, ఇంగ్లిష్‌లో 8 కి 8, రూరల్ డెవలప్‌మెంట్‌లో 8కి 8, సోషల్ వర్క్‌లో 14 కి 14, తెలుగులో 9 కి 9, ఎంబీఏలో 60 కి 60, ఎంకాంలో 21కి 21, ఎంఈడీలో 35 కి 35, ఎంఎల్‌ఐఎస్సీలో 18 కి 18, ఎననాకల్ కెమిస్ట్రీలో 45కి 27, బయెటెక్నాలజీలో 24కి 24, ఫిజిక్స్‌లో 15కి 11, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 147కి 81, గణితంలో 9కి 9, జువాలజీలో 12 కి 11, మైక్రో బయోలజీలో 20కి 20, కంప్యూటర్ సైన్స్‌లో 27కి 21, అప్లయిడ్ మ్యాథ్స్‌లో 9 కి 9, సోషల్ వర్క్ నాలుగో సెమిస్టర్‌లో 6 కి 6 మంది ఉత్తీర్ణత సాధించారు. రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా చేసుకోవాలని సూచించారు.

దారి కాచిన మృత్యువు

- ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు ఒడిశా గిరిజనులు మృతి
- 25 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- మందస మండలంలో ప్రమాదం



సంఘటనా స్థలంలో బోల్తాపడిన ట్రాక్టర్

మందస: రెండు ట్రాక్టర్ల కోసం మాట్లాడుకుంటే.. ఒకటే వచ్చింది. పాతిక మందికి కూడా పట్టని ట్రాక్టర్ తొట్టెలో.. ఏకంగా యాభై మంది ఎక్కేశారు. సమావేశంలో పాల్గొనడానికి ప్రాణాలను బలిపెట్టారు. ఇన్ని కలగలిపి ఇద్దరు గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. మరో పాతిక మంది గాయాలపాలయ్యారు. మందస మండలంలోని తాళ్లగురంటి పంచాయతీ గౌడుగురంటి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒడిశా బురతలో పంచాయతీ గుడ్డిపద్రో గ్రామానికి చెందిన సవర ఈశ్వర్ అలియాస్ డెరా(55), కుసుమలో గ్రామానికి చెందిన బుయ్యా జగన్నాథ్(47)లు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..

మందస మండలం తాళ్లగురంటి సరిహద్దులోని గల ఏఓబీ ప్రాంతంలో గల గంజాం జిల్లా పాత్రపురం బ్లాక్ చీకటి నియోజకవర్గం పరిధిలో గుడ్డిపద్రో, తాళబడో, కుసుమల, లియాబలి, అడపాత్ర, బత్తరసాయి తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఒడిశాలోని చీకటి గ్రామంలో జరిగే ఓ సమావేశానికి వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. మందస మండలంలోని బుడారిసింగి ప్రాంతంలో రెండు ట్రాక్టర్లను అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే మంగళవారం బుడారిసింగికి చెందిన ఒక్క ట్రాక్టర్ మాత్రమే ఆ గ్రామానికి వెళ్లింది. దీంతో సుమారు 50 మంది వరకు గిరిజనులు ఆ ట్రాక్టర్‌లోనే కర్రలను సాయంగా పెట్టి, వాటిని పట్టుకుని ప్రయాణం సాగించారు. సంబంధిత గ్రామాల నుంచి చీకటికి మందస మండలంలోని తాళ్లగురంటి ప్రాంతం నుంచే దారి ఉంది. అయితే బండి గౌడుగురంటి సమీపంలో గల కల్వర్టు వద్దకు వచ్చేసరికి మలుపు ఉంది. సరిగ్గా అదే ప్రాంతంలో డ్రైవర్ కాస్త ఏమరపాటుగా వ్యవహరించడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సవర్ ఈశ్వర్, బుయ్యా జగన్నాథ్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. కార్జి మమత, సవర సంతోష్, సవర సున్నారి, సవర గురుమూర్తి, సవర రాజులకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, బుడారిసింగి సర్పంచ్ సురేష్ కుమార్‌పాణిగ్రాహి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో సహాయ చర్యలు చేపట్టారు. మందస, పలాస, సోంపేట, కంచిలి 108 అంబులెన్స్‌లకు, మందస పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో సవర శ్రీపతి, గణేశ్, కుక్కిలి, అనంత్, ప్రసాద్, జోగారావు, మంగళ, ఖెండి, దుల్లభో, సుక్కు, సబిత, రొయిబారి, హడియాని, లక్ష్మి, దాలిమ, ఇసంగో, సుక్రు, చంద్రి, గందర, కూర్మా, నారాయణ, సుమతో తదితరులకు గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న స్థానికులు క్షతగాత్రులకు సాయమందించారు. మందస, పలాస ప్రభుత్వాస్పత్రులకు 25 మందిని పంపగా.. వారిలో నలుగురిని శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు, మందస ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మరణించిన బుయ్యా జగన్నాథ్



సవర ఈశ్వర్ మృతదేహం



క్షతగాత్రులను 108వాహనంలో తరలిస్తున్న దృశ్యం



తీవ్రంగా గాయపడిన ఓ గిరిజన వృద్ధురాలు

అర్హులంతా ఓటు హక్కు పొందాలి

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్



బైక్ ర్యాలీని ప్రారంభించిన జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పురుషుల ప్రభుత్వ కళాశాల ప్రధాన రహదారి నుంచి మంగళవారం ఉదయం నిర్వహించిన స్వీప్ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. జిల్లా జనాభాలో 18 ఏళ్లు నిండిన 46 వేలమంది యువత ఉండగా వారిలో 18 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారని చెప్పారు. మిగిలిన వాళ్లు కూడా ఓటర్లుగా చేరాలన్నదే స్వీప్ కార్యక్రమం లక్ష్యమన్నారు. జిల్లాలో 2500 మంది అధికారులు 24 లక్షల మంది ఓటర్ల జాబితా తయారీలో ఎంతో శ్రమకోర్చి పని చేస్తారని, అన్ని వర్గాల సహాయ సహకారాలతోనే అది సాధ్యమన్నారు. ఓటుహక్కు వినియోగించని వారికి అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటరుగా నమోదయ్యే ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చన్నారు. ఈ రోజు నుంచి డిసెంబర్ 9 వరకు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ కె.వెంకటరావు, డీటీలు బీవీవీఎస్ రజు, వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గంగపుత్రుల బెంగ తీరేలా..

- మత్స్యకారులకు మేలు చేస్తున్నాం: ఎమ్మెల్యే కృష్ణదాస్
- ఘనంగా మత్స్యకార దినోత్సవం
- ఆక్వా ల్యాబ్ ప్రారంభం
- రూ. 58 లక్షలు విలువ చేసే వాహనాలు పంపిణీ



మత్స్యకార ల్యాబ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మత్స్యకారులను అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగు పరిచేందుకు ఈ 54 నెలల్లో వైఎస్ జగన్ సర్కారు రూ.4,486 కోట్లు ఖర్చు చేసిందని మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అమరావతి నుంచి సీఎం ప్రారంభించగా, కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ విశాఖ హార్బర్‌లో అగ్నిప్రమాదం కారణంగా 33 బోట్లు కాలిపోయిన సంఘటనలో ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి 80 శాతం నష్టపరిహారాన్ని చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. మత్స్యకార భరోసా సాయం కింద రూ.10 వేలు, డీజిల్ సబ్సిడీ లీటర్‌కు రూ.9, వేట చేస్తూ మరణిస్తే రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో జిల్లాలోని మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రూ.11వేల కోట్లతో రాష్ట్రంలో వివిధ పోర్టుల నిర్మాణం జరుగుతోందని, అవి పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రం పూర్తిగా మారుతుందన్నారు.

ఆక్వా ల్యాబ్ ప్రారంభం

కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ. 35 లక్షల విలువ చేసే మొబైల్ ఆక్వా ల్యాబ్, రూ.14 లక్షల రాయితీతో, 13.29 లక్షల విలువ చేసే చేపల సీడ్ రవాణా వాహనం రూ. 8లక్షల రాయితీతో, రూ. 10 లక్షల విలువ చేసే ఫిష్ కియోస్క్ రూ.4లక్షల రాయితీతో లబ్ధిదారులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పంపిణీ చేశారు. మత్స్యకార భరోసా సహాయం కింద జిల్లాలో ఈ ఏడాది 15,281 మందికి రూ.10,000 చొప్పున రూ.1528.1 లక్షల సహాయాన్ని వారి వారి అకౌంట్లలోకి నేరుగా జమ చేస్తున్నామన్నారు. మొబైల్ ల్యాబ్‌ను కలెక్టర్ లాఠకర్ ఆసక్తిగా పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు పీవీ శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ వరప్రసాద్, పలువురు మత్స్యకార సంఘ నాయకులు కోన నర్సింగరావు, ఆప్కాబ్ డైరెక్టర్ బి.తోటమ్మ, మైలపల్లి పోలీసు, వైస్ ఎంపీపీ వంక రాజు, సొసైటీ అధ్యక్షులు సూరాడ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మత్స్యకార సంఘ నాయకులను సత్కరించారు.



బడులు బాగయ్యాయి



ప్రభుత్వ పాఠశాలలను చాలా ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నాడు–నేడు ద్వారా బడులను బాగు చేశారు. మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేసి ఆదుకున్నారు. పాఠశాలకు ఎఫ్‌ఆర్‌ఎస్ పెట్టి పకడ్బందీగా అమలు చేయడం గొప్ప విషయం.

– హెచ్‌వీ లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, బూర్జ

ఎవరి చుట్టూ తిరగకుండానే..



గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మా సొంతింటి కల నెరవేరలేదు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరి చుట్టూ తిరగకుండానే.. జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరు చేశారు. ఆ ఇల్లు కట్టుకుని ఇప్పుడు అందులోనే ఉంటున్నాం. సీఎం వైఎస్ జగన్ వల్లనే ఎన్నో ఏళ్ల మా కల నెరవేరింది.

– వానపల్లి జ్యోతి, ఉప్పపేట గ్రామం, వావాం పంచాయతీ,బూర్జ మండలం

క్లుప్తంగా

'శిక్షణ సద్వినియోగం చేసుకోండి'



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారా లీగల్ వలంటీర్లు ఉచితంగా న్యాయ సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కోర్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. అవసరమైన చట్టాలపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రాథమిక అవగాహన ఏర్పరచుకుని, ఉచిత న్యాయ సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అన్నెపు భువనేశ్వరరావు మాట్లాడారు.

23 నుంచి బీఈడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఈడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం తెలిపారు. 901 మంది పరీక్షకు హాజరవుతుండగా, జీసీఎస్ఆర్ రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. బీటెక్ ఏడో సెమిస్టర్ ఈ నెల 28వ తేదీ నుంచి ఉంటుందన్నారు.

ఒడిశా వైపు వెళ్లిన పెద్దపులి



ఒడిశాలోని అనబార గ్రామంలో పులి దాడిలో చనిపోయిన ఆవు

పాతపట్నం: పెద్దపులి ఒడిశా వైపు వెళ్లింది. ఇటీవల టెక్కలి, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో కొంత కాలంగా పెద్దపులి సంచారం చేయడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. పెద్దపులి సోమవారం రాత్రి పాతపట్నం, సరాళి మీదుగా మహేంద్రతనయ నది దాటి ఒడిశా వైపు వెళ్లిందని పాతపట్నం ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అమర గ్రామం మీదుగా అనబార గ్రామంలో ఆవుపై దాడి చేసింది. పెద్దపులి ఒడిశా వైపు వెళ్లడంతో పాతపట్నం, అంతాబ, సరాళి, చంగుడితో పాటు సరిహద్దు ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

26న జిల్లా సీనియర్స్ మహిళల కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ మహిళల కబడ్డీ జట్టు ఎంపికలు ఈ నెల 26వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల మొదలవుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను నవంబర్ 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కర్నూలు జిల్లా వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. 75 కేజీల్లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఎలాంటి వయో నిబంధన లేదని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 94419 14214 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'ప్రభుత్వ విద్యార్థుల భవిత ముఖ్యం'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారి అభివృద్ధికి ఉపకరించే చక్కని వార్షిక ప్రణాళికలను సిద్ధం చేయాలని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం వార్షిక బడ్జెట్ ప్రణాళిక 2024-2025 తయారీపై జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఉద్దేశించి ఏపీసీ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ రానున్న సంవత్సరానికి పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, విద్యార్థుల ప్రగతికి అవసరమైన వార్షిక ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలని సూచించారు. బడి బయట పిల్లలను, దివ్యాంగ విద్యార్థులను, వివిధ రకాల సామాజిక వర్గాలకు చెందిన పిల్లలను దృష్టిలో ఉంచుకొని మెరుగైన ప్రణాళికల కోసం పాఠశాల అభివృద్ధి కమిటీలతో చర్చించి వార్షిక బడ్జెట్ ప్రణాళికలను తయారు చేయాలన్నారు.

విత్తనం నుంచి విక్రయం వరకు

- అడుగడుగునా అన్నదాతకు ప్రభుత్వం అండ
- ఆర్‌బీకేలతో రైతులకు సేవ
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సిద్ధం



శ్రీకాకుళం పాతబస్టాండ్: అన్నదాతకు అడుగడుగునా ప్రభుత్వం అండగా నిలబడుతోంది. పెట్టుబడి సాయం నుంచి మద్దతు ధర వరకు, ఉభాల నుంచి కోతల వరకు, విత్తు నుంచి విక్రయాల వరకు అన్ని దశల్లోనూ రైతులకు కావాల్సిన సాయం అందజేస్తోంది. గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు వంటి వాటి కోసం పడి గాపులు కాసేవారు. నాణ్యమైన విత్తనాల కోసం దూర ప్రాంతాలకు పరుగులు తీసేవారు. నేడు ఆ పరిస్థితులు కనుమరుగైపోయాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ఇంటికే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వస్తున్నాయి. సాగుకి అవసమైన పెట్టుబడి విడతల వారీగా ప్రభుత్వమే ఇస్తోంది. రైతులకు బ్యాంకు రుణాలు, ఆ రుణాలకు వడ్డీ రాయితీని కల్పిస్తున్నారు. పంటకు మద్దతు ధరను చెల్లించి సర్కారే కొనుగోలు చేస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలతో రైతుల అవసరాలు అన్ని వేళలా తీరుతున్నాయి. రైతు వేసే ప్రతి పంటను ఈ క్రాప్ విధానం ద్వారా లెక్కించి వారికి కావాల్సిన సాయం అందిస్తున్నారు. నష్టం జరిగినప్పుడు రైతులకు మేలు జరిగేలా బీమా పరిహారం అందజేస్తున్నారు. రైతుల కళ్లాలకు వెళ్లి మరీ ధాన్యం కొనే కొత్త పద్ధతిని ప్రవేశపెట్టారు. దీంతో రైతులకు రవాణా భారం కూడా తగ్గింది. జిల్లాలో 625 రైతు భరోసా కేంద్రాలు ఉండగా 390 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు కావాల్సిన సిబ్బంది నియమించారు.

దళారులకు చెక్

ఆర్‌బీకేలు రాక మునుపు రైతు పంట అమ్ముకోవడం పెద్ద ప్రహసనంగా ఉండేది. ఇటు రైతు అటు ప్రభుత్వం కాకుండా మధ్యలో దళారీలు మాత్రమే లాభపడ్డారు.

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాక రైతుల కళ్లాలకే సిబ్బంది వచ్చిన పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు కష్టాలు తీరుతున్నాయి. రైతు కష్టం ప్రతి పైసా, తనకే చేరుతోంది. గతంలో 82 కేజీల ధాన్యం బస్తాకు రూ.1600 ధర ఉన్నప్పుడు దళారులు రూ.1250, రూ.1300లకే కొనుగోలు చేసేవారు. దీని వల్ల రైతులు బస్తాకు రూ.340 నుంచి రూ.400 వరకు నష్టపోయేవారు. 100 నుంచి 200 బస్తాల వరకు విక్రయించే రైతులకు రూ.వేలల్లో నష్టం జరిగేది. ఇప్పుడు ప్రభుత్వానికి విక్రయించడంతో ప్రభుత్వం ప్రకటించిన పూర్తి మద్దతు లభిస్తోంది. నేరుగా రైతు ఖాతాలో డబ్బు పడుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా ఆర్‌బీకేకు ధాన్యం ఇస్తున్నా..



నాకు ఆరెకరాల పొలం ఉంది. ఖరీఫ్‌లో వరి పండిస్తున్నాను. గత ప్రభుత్వంలో పంట అమ్ముకోవడం కష్టంగా ఉండేది. ఆర్‌బీకేలు వచ్చిన తర్వాత ఆ ఇబ్బందులు పోయాయి. నేరుగా ఈ క్రాప్ ఆధారంగా వాళ్లే కళ్లం వద్దకు వచ్చి ధాన్యం తీసుకెళ్తున్నారు. నాకు ధాన్యం డబ్బులేవీ బకాయి లేవు. ఈ ఏడాది కూడా ఆర్‌బీకేలకే ధాన్యం ఇస్తాను.

– కె.గోపి, రైతు, శ్రీకాకుళం మండలం, వాలకవలస

ప్రతీ గింజ కొంటాం



జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయనున్నాం. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ఈ ఏడాది సుమారుగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే స్థానిక అవసరాలకు రైతులు ఉంచుకొని అమ్మకాలు చేస్తారు. ఆ ధాన్యం అంతా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

– కె.శ్రీనివాసు, డీఎం, సివిల్ సప్లై కార్పొరేషన్, శ్రీకాకుళం.

జనం గుండెల్లో జగన్



మెళియాపుట్టి నుంచి పెద్దలక్ష్మీపురం గ్రామం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెళియాపుట్టి: వినూత్న సంక్షేమ పథకాలతో వైఎస్ జగన్ జనం గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించి బైక్ యాత్ర ప్రారంభించారు. 6 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగింది. ఎంపీపీ స్వగ్రామమైన పెద్దలక్ష్మీపురం గ్రామం వరకూ వెళ్లి.. పెద్దలక్ష్మీపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో ఇదే చివరి కార్యక్రమం.

ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, పల్లి యోగి, వట్టికుళ్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దలక్ష్మీపురం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'పథకాల ప్రచారమే ప్రధాన ఉద్దేశం'



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ రోహిత్ మాథూర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలకు సంబంధించి పౌరులకు అవగాహన కల్పించడం, అలాగే ప్రధాన పథకాలు నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిని చేరుకునేలా పనిచేయడం వికసిత భారత సంకల్ప యాత్ర ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ రోహిత్ మాథూర్ అన్నారు. జిల్లాలో ఈనెల 26వ తేదీ నుంచి జనవరి ఒకటో తేదీ వరకు వికసిత సంకల్ప యాత్ర ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటివరకు ప్రయోజనం పొందని బలహీన వర్గాలను చేరుకోవడం అవసరమని, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లాంటి పథకాలు అందుకు నిదర్శనమని, యాత్ర ప్రధాన ఉద్దేశం కూడా అదేనని అన్నారు. జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ 17 సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులకు అందుతున్న అంశంలో గణాంకాలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. పథకాల విస్తృత ప్రచారం కోసం ఏమేం చేయవచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వికసిత భారత సంకల్ప యాత్ర, జిల్లా నోడల్ అధికారి, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పథక సంచాలకులు డీవీ విద్యాసాగర్, జిల్లా నీటి యాజమాన్య శాఖ పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రోహిత్ మాథూర్ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను మర్యాద పూర్వకంగా ఆయన చాంబర్‌లో కలిశారు.


27న ఎచ్చెర్లలో సాధికార బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో ఈ నెల 27న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నామని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో సాధికార బస్సు యాత్రపై మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు విజయవంతంగా బస్సు యాత్ర సాగిందని, ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ అదే రీతిలో జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 27న మధ్యాహ్నం 11 గంటలకు పైడిభీమవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశం, విశ్రాంత ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం, ఒంటి గంటకు రణస్థలం ఆదర్శ పాఠశాల సందర్శన, భోజన విరామం అనంతరం బుడుమూరు సచివాలయం సందర్శన, 3 గంటలకు చిలకపాలెం జంక్షన్‌లోని పొందూరు రోడ్డు వైపు బహిరంగ సమావేశం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట రత్నం ప్రసాద్, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, రణస్థలం, జి. సిగడాం జెడ్పీటీసీలు టొంపల సీతారాం, కాయల రమణ మండల నాయకులు మీసాల వెంకటరమణ, మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, సనపల నారాయణరావు, కిల్లారి రమణ, పల్లాడ సన్యాసిరావు, మురళీధరబాబా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో సింగపూర్ రెడ్‌క్రాస్ సేవలు



గిరిజన గ్రామాల్లో కిట్లు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు

మందస: గిరిజన ప్రాంతాల్లో సింగపూర్‌కు చెందిన రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో హైజీన్ కిట్లు పంపిణీ చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు డానియల్, ఎం.సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ జరిగింది. మారుమూల గిరిజన తండాల్లో జీవిస్తున్న నిరుపేద గిరిజనులు పౌష్టికాహారం లోపంతో బాధ పడుతున్నారని గుర్తించిన సింగపూర్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సుమారు రెండు వేల మంది పేద గిరిజనులకు హైజీన్ కిట్లు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా మందస మండలంలోని సాబకోట పంచాయతీ గల చిన్నరంగమెటియా, బిత్తరబంద, బలియాసాయి, భావనాపురం, కొయిటాపొంకాళలో పౌష్టికాహార కిట్లను అందించింది. అలాగే ఇంటర్నేషనల్ వరల్డ్ హెల్త్ ఆర్గనేజేషన్ ద్వారా శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రెడ్‌క్రాస్ సింగపూర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో దోమతెరలు, దుప్పట్లు, పౌష్టికాహారం కిట్లను గిరిజనులకు అందజేస్తున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ముందస్తు అవగాహనతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలాస ఆర్డీఓ ఎస్.భరత్‌నాయిక్, తహసీల్దార్ బడే పాపావు, ఎంఆర్ఐ ఎస్.చిన్నారావు, సర్పంచ్ సవర సంధ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవర రాము, సవర గౌరి, రెడ్‌క్రాస్ జిల్లా ప్రతినిధులు పి.శ్రీకాంత్, పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, ఎం.కల్యాణచక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి వీఆర్వోలు కె.జయప్రకాశ్, శిస్టు రామచంద్రరావు, ముంజేటి కిరణ్‌కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని పెంచడం ఓ అద్భుత కళ



మాట్లాడుతున్న వేణుభగవాన్

మందస: చిన్న వయస్సులో పిల్లల్ని పెంచడం ఓ అద్భుత కళ అని ప్రముఖ వక్త, మోటివేషనల్ స్పీకర్, రచయిత, కార్పొరేట్ ట్రైనర్ వేణుభగవాన్(హైదరాబాద్) అన్నారు. మందస మండలంలోని కుంటికోటలో గల కె.నారాయణ హైస్కూల్‌లో అమ్మ నాన్న ఓ జీనియస్ అనే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పిల్లలకు అనుగుణంగా తల్లిదండ్రులే మారాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను కాకుండా వారు చేసిన పనులను కూడా ప్రశంసించాలన్నారు. వారు చేసే తప్పులను సరిదిద్ది, పునరావృతం కాకుండా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో కె.నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ గుంట రోహిణి, డైరక్టర్లు బుద్ధసూర్య, అరవింద్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేసీబీ డ్రైవర్ అనుమానాస్పద మృతి



తిప్పన మీనరాజ్

ఇచ్ఛాపురం: పట్టణంలోని చిదంబరేశ్వరాలయం వద్ద జేసీబీ డ్రైవర్ తిప్పన మీనరాజ్ (25) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం గుడికి దర్శనానికి వెళ్లిన భక్తులు గుడి మెట్ల వద్ద మీనరాజ్ మృతదేహాన్ని చూసి పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఆల యం వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి వివ రాలు సేకరించగా మృతుడు మండలంలోని భవానిపురానికి చెందిన మీనరాజ్‌గా తెలిసింది. ఇతను చెడు వ్యసనాలకు బానిసై సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆలయానికి సమీపంగా రైల్వే ట్రాక్ ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రైలు ఢీకొట్టడంతో తలకు, శరీరానికి తీవ్ర గాయాలై మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తిత్లీ తుఫాన్ పరిహారం పంపిణీలపై ఆడిట్



కవిటిలో ఆడిట్ అధికారులతో సమావేశమైన తహసీల్దార్ శేఖర్

కవిటి: తిత్లీ తుఫాన్‌కు సంబంధించి పంట నష్టపోయిన రైతులకు అందించిన నష్ట పరిహారాల పంపిణీపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఆడిట్ నిర్వహించారు. సీనియర్ ఆడిటర్ టి.శ్రీనివాస్, గంగరాజులు ఈ ఆడిట్ ప్రక్రియ చేపడుతున్నారు. ముందుగా ఆడిట్ శాఖ అధికారులు తహసీల్దార్ పి.శేఖర్, ఉద్యాన శాఖ అధికారి పోలాకి మాధవీలత, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రావులతో రెవెన్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. నష్ట పరిహారం వాస్తవ పరిస్థితుల్ని రికార్డుల తనిఖీ ద్వారా గుర్తించి ఇందుకు సంబంధించిన వాస్తవ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నారు.

రాష్ట్ర బేస్‌బాల్‌లో మనోళ్లు అదుర్స్



రాష్ట్ర స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ పోటీల్లో ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బేస్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలబాలికల జట్లు జయకేతనం ఎగుర వేశారు. నంద్యాల జిల్లా నిడుతూరు వేదికగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు 67వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలిక బేస్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాల బాలికల జట్లు టోర్నీ అంతటా అద్భుతమైన ఆటతీరుతో రాణించి తృతీయ స్థానంలో నిలిచాయి. మెరుగైన ఆటతీరుతో రాణించిన నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బి.రాజేష్ (జెడ్పీహెచ్‌స్కూల్ ఇప్పిలి), ఎ.అనిల్‌కుమార్ (జెడ్పీహెచ్‌స్కూల్ లావేరు), కె.దేవిప్రియ (జెడ్పీహెచ్‌స్కూల్ ఇప్పిలి), బి.వెన్నెల (జెడ్పీహెచ్‌స్కూల్ ఇప్పిలి) జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: క్రీడా పోటీల్లో పాల్గొనడం ఓ మధురానుభూతిగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. 76వ అంతర పాఠశాలల గ్రిగ్స్ (నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గ) పోటీలను కె.మత్స్యలేశంలోని బుద్ధా పాఠశాలలో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీలను బుద్ధా పాఠశాల, పాఠశాల క్రీడా సంఘం సంయుక్తంగా నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ గెలుపోటములకు సంబంధం లేకుండా ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని కోరారు. రెండు రోజుల పాటు వేరే ప్రదేశంలో ఉండటం వల్ల ఆ ప్రాంత వాసులతో పరిచయం, వేర్వేరు ప్రదేశాలకు చెందిన విద్యార్థులతో మాట్లాడుకోవడం వంటివి జీవితంలో ఉపయోగపడతాయన్నారు. వాలీబాల్ పోటీలను ప్రారంభించి మంత్రి ధర్మాన కాసేపు ఆడారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ బి. లలిత, రాష్ట్ర నాటక అకాడమీ డైరక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, బుద్ధా పాఠశాల చైర్మన్ బి. ఎర్రన్న, అరవల రామకృష్ణ, మార్పు పృథ్వీరాజ్, వమరవల్లి ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

కన్నేవలస సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం కన్నేవలస సర్పంచ్ రావాడ రాజేష్‌కుమార్ చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కోటబొమ్మాళి ఎంపీడీఓ కుప్పిలి ఫణీంద్రకుమార్ మంగళవారం తెలిపారు. కన్నేవలస పంచాయతీలో నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని, విచారణ చేపట్టాలని ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త దువ్వాడ వాణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో.. కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి డీఎల్‌పీఓ ఐవీ రమణ, ఈఓపీఆర్డీ బి.రామారావు నిధుల వినియోగంపై విచారణ చేశారు. అనంతరం నివేదికను డీపీఓకు పంపారు. ఈ మేరకు సర్పంచ్ రాజేష్‌కుమార్ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు డీపీఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీల్లో అ'ద్వితీయం'



రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీల్లో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. చిత్తూరు జిల్లా బంగారుపాల్యం వేదికగా ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు 67వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలిక ఖోఖో చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. టోర్నీ అంతటా నిలకడగా రాణించిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.భావన (జీహెచ్‌స్కూల్ ఇప్పిలి), ఆరు సరస్వతి (ఎంజీహెచ్‌స్కూల్ ఇచ్ఛాపురం), స్టాండ్‌బైగా వై.భవాని(జెడ్పీహెచ్‌స్కూల్ డొంకూరు) జాతీయ పోటీలకు ఎంపికైనవారిలో ఉన్నారు. వీరిని డీఈఓ వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.హరిబాబు, పీఈటీ సంఘ ప్రతినిధులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఆనందకిరణ్, ఖోఖో సంఘ ప్రతినిధులు అభినందించారు.